# తల్లిమనసు




పాప స్కూలుకెళ్ళింది. ఈయన కూడా బయటకు వెళ్ళారు. పని పూర్తిచేసుకొని హాల్లో వాలుకుర్చీలో పడుకొన్నా... మనసులో ఏవో ఆలోచనలు. నా ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ రెండు పిచ్చుకలు కిచకిచమంటూ వచ్చి మేము బట్టలారవేసుకొనే తీగపై వాలి నాయి. నాకెందుకో చిరాకనిపించి వాటిని లేవ గొట్టేశా. కాని... అవి మరల వచ్చాయి. మళ్ళీ తోలేసా. ఈ విధంగా రెండు మూడు తడవలు జరిగాక నేను కామ్‌గా వాటి చర్యలు పరిశీలిస్తూ కూర్చున్నా... కాసేపు ఆ రెండు వాటి భాషలో సంభాషించుకొంటూ హాయిగా ఆడుకొంటు న్నాయి.

ఈలోగా ఇంకో మగపిచ్చుక వచ్చి ఆ తీగపై వాలింది. అంతే ఆడపిచ్చుకతో కబుర్లాడుతున్న ఈ మగపిచ్చుక దాన్ని తరిమి తరిమి గొట్టింది. దాని ప్రవృత్తిలో కూడా మానవ నైజాన్ని చూసి నాలో నాకు నవ్వు వచ్చింది. ఈ విధంగా వాటితో నా అనుబంధం మొదలైంది. వాటి కెక్కడా రక్షణ లేనట్లు అవి మా వంట ఇంట్లో దూలం మీద గూడు కట్టుకొన్నాయి. నాతో పాటు తెల్లవారుజామునే లేచేవి. ముందు ఆడ పిచ్చుక లేచి కాసేపు అటు ఇటు ఎగిరి కిచ కిచమని అరిచేది. ఆ లైటు వెలుతురులోదాని నీడ చాలా అందంగాఉండేది. ఆ కిచ కిచ వినగానే మగపిచ్చుక బయటకు వచ్చేది. అది ఆడపిచ్చుక దరి చేరి దాని ముక్కుపై తన ముక్కు ఆనించి అటు ఇటు తిప్పుతూ చిన్నగా పొడిచేది. నాకు వాటి అన్యోన్యత చూస్తే చాలా ఆనందమేసింది.

ఒక రోజు నేను లేచి చాల సేపయినా పిచ్చుక జంట లేవలేదు. ఏమిటా! అనుకొన్నా... దూలంవైపు చూడ గానే ఆడపిచ్చుక ఒకతే దిగులుగా దూలంపై కూర్చొంది. అది నీరసంగా ఎగురుతూ కిటికీ చువ్వ దగ్గరకెళ్ళి బయటకు తొంగి చూసి మరల దిగాలుగా వచ్చి దూలంపై కూర్చొంది. అప్పుడర్థమైంది నాకు బహుశ దాని దిగులు మగపిచ్చుక కోసమని... పాపం అదెక్కడికెళ్ళిందో... కాని తెల్లారక మగపిచ్చుక వచ్చే సిందనుకోండి.

ఇలా రోజులు గడిచిపోతున్నాయి. ఆ పిచ్చుక జంట అనురాగాల పంట పండి గూటిలో కిచకిచలు ఎక్కువై పోయాయి. కాని ఇంతలోనే కళ్ళునా సరిగా తెరవని పసిగుడ్డు క్రిందపడి ప్రాణాలు కోల్పోయింది. ఆ పిచ్చుక మనసులో ఏమో కాని నాకు మాత్రం అయ్యో అనిపించింది.

ఆ రోజు మధ్యాహ్నం మా పాప ఫ్రెండ్స్ వస్తే సరదాగా కబుర్లు చెప్పుకొంటున్నారు. వరండాలో కూర్చొన్న మాకు వంటింట్లో ఏదో గరగరా శబ్దం విన్పించింది. అందరం కాస్సేపు మౌనంగా వుండి పోయాం. నేను మెల్లగా వెళ్ళి లైటు వేసి చూశా కాని నాకేమీ కన్పించలా... రాబోతుంటే మరల అదే శబ్దం ఈసారి గట్టిప్రయత్నం చేదునుగా... కడిగి బోర్లించిన ఇడ్లీ పాత్ర ప్లేటులో పాదిగి పాదిగి కూర్చోటానికి ప్రయత్నిస్తున్న పిచ్చుక పిల్ల కన్పించింది. అప్పటి నుండి నాపాట్లు మొదలైనాయి. దానిన ఆ గూట్లో పెట్టాలని శతవిధాల ప్రయత్నించా. కాని ఫలితం లేకపోయింది. పై నుండి క్రింద పడడంలో దిమ్మెర పోయిందేమో నను కొని కొంత వెచ్చదనం ఇద్దామనుకొని ఒడిలోకి తీసుకో బోయా కాని నా చేతిలో నుండి తుర్రున జారి పోయింది. ఎగరటం వచ్చింది కాని, వచ్చీరాని రెక్కలు, బాగా ఎగురలేకపోతుంది. అయినా ఆ పిల్లకేం తొందర రొచ్చింది! అప్పుడే గూటిలో నుండి రావడానికి. ఈలోగా తల్లి వచ్చింది. పిల్లని చూసి ఆహారం పెడుతుందేమోనని ఇవతలకు వచ్చా. ఉహూ...అది ఈ పిల్ల సంగతి పట్టించుకోక గూటిలోని పిల్లకు నిముషానికి ఒకసారి వచ్చి ఆహారం పెట్టి వెళ్ళిపోతున్నది. ఈ పిల్లనేం చేయాలో తోచలేదు. ఒక మెత్తని గుడ్డ రెండు మూడు వరసలు పరచి, దాని మీద కాసిని నూకలుపోసి ఈ పిచ్చుక పిల్లను దానిమీద కూర్చోపెట్టా వెచ్చదనానికి. కాని అది అక్కడా స్థిరంగా కూర్చో లేదు. చిన్నగా పోయి దేవుని గూట్లో, అక్కడ నుండి గ్యాస్ పొయ్యి స్టాండు లోను వాదికి వెచ్చగా కూర్చొంది. నా గుండె దడ దడమంది మరచిపోయి పొయ్యి వెలిగిస్తే ఆ సెగకి మాడిపోతుందేమోనని... ఇదంతా జరిగేసరికి మా భోజనాలు కూడా అయిపోయి పడుకోబోతున్నాము.

సరే ఎలాగో దాన్ని బయటకు తీసే ప్రయత్నం చేస్తుంటే మా వారొచ్చి 'అబ్బబ్బ ఏమిటే వెధవ గొడవ ఇందాకటి నుంచి... దాన్నక్కడే ఉండనీ.... రేపొద్దున గదా నువ్వు పొయ్యి వెలిగించేది అప్పటి సంగతి చూసుకోవచ్చు. ఇంక పడుకో పదా... అంటూ ఊపిరి తీసుకోకుండా తొందర చేసేసరికి చేసేదేమీ లేక వచ్చేశా. కాని పిల్ల మీదే ధ్యాస.

మర్నాడు ఆ పిల్లను తీసి బుట్ట కింద కప్పేసా... నాపనంతా అయిపోయాక దాన్ని ఇవతలకు తీసి నాలుగు లేత ఆకుచిగుర్లు, అన్నం మెతుకులు ముందు పడేసా... అది వాటివైపుచూడకుండా నీలుక్కొని కూర్చొని 'అమ్మ పెట్టాలి, తినాలి'అన్నట్లు తల్లికిచకిచ వినబడగానే తనూ కిచకిచమంటూ ఆశగా దూలంవైపు చూసేది. దాని బాధేమిటో నాకు తెలియదు నిన్న మధ్యాహ్నం నుంచి అది అలాగే కూర్చొంది. అది చూస్తూన్న నాకు చాలా బాధగా వుంది. నాబాధ చూడలేని మనారు 'వెధవపిల్ల' అంటూ దాన్ని హాల్లోకి తరిమేశారు. 'అయ్యో అలా తరిమేయకండి మిగతా పిచ్చుకలు దాన్ని పొడిచి చంపి తింటాయి' అంటూ దానికి కాపలా కాయడం మొదలుపెట్టాను. అయితే తమాషాగా దానికి వంటింట్లో ఆహారం పెట్టని తల్లి హాల్లోకి రాగానే పెట్టసాగింది. 'హమ్మయ్య' అని ఊపిరి పీల్చుకున్నా...

— ఎం.వి.వి.యస్. గిరమ్మ

పాప, వారు వెళ్ళిపోయాక అన్నీసర్దేసి బయటకు రాబోతున్న నా కాళ్ళకు ఇంకో పిచ్చుక పిల్ల అడ్డం తగిలింది. 'ఓసి నీ నీ పిల్ల బంగారంకాను' అనుకొంటూ దాన్ని కూడా తీసుకెళ్ళి హాల్లో వదిలేశా. ఆ రెండు కలసి ఆడుకొంటాయని. కాని... ఒకటుటు - ఒకటేటు - వాటిని కాపాడలేక నానా అవస్థపడ్డా నా పాట్లు చూసిన మా ఇంటామె 'ఏవిటండోయ్ అందరూ సిలకలు, పావురాలు పెంచితే మీరు పిచ్చుకలను పెంచుతున్నా'రంటూ హాస్యం చేసింది. 'అది కాదండి బాబు' అంటూ జరిగింది వివరించా... ఆమె నవ్వుతూ 'అదే నమ్మా పెద్దవాళ్ళు అంటారు రెక్కలొచ్చిన పక్షి గూడొదిలి పోతుందని, వీటికి సరిగా రెక్కలొచ్చాయో లేదో అంత మిడిసితనం' అంటూ వెళ్ళింది. ఎలాగోలా వాటిని ఆరోజు కాకుల బారి నుంచి రక్షించా...వాటి తల్లి వాటికి ఆహారం పెడుతుంది చాలు అని తృప్తి పడ్డా.

సాయంత్రం చీకట్లు పడుతుంటే ఒక పిల్ల వచ్చి బస్తాల మీద వయ్యారంగా కూర్చొంది... ఇంకోటి విరబూసిన బంతి చెట్టులో అందంగా కూర్చొంది.. నాకెంతో సంబరంగా వుంది... ఇంతలో మా ఇంటామె వచ్చి 'బస్తాలమీదైతే రాత్రిళ్ళు పిల్లి వస్తుంది... తినేస్తుంది... ఇంట్లో పెట్టు' అంది. నిజమేనని పట్టుకోబోయా. తుర్రుమని జాజి పందిరెక్కింది. దీనికి ఎగరటం బాగా వచ్చింది కాని స్వయంగా ఏరుకు తినడం రాలేదు... అక్కడ పట్టుకోబోయా... ల్రెటిన్ గోడెక్కింది... నాకు పంతం వచ్చి, అక్కడకు పిల్లల్ని ఎక్కించా. అక్కడ నుండి ప్రక్కింటి చెట్టు మీదికి, అటు నుంచి దగ్గర్లో నున్న గుడి మీది కెక్కడికో వెళ్ళిపోయిందా పిల్ల. ఏదో వెలితి అనిపించింది. దాన్ని ఆపద నుంచి రక్షించబోయి, ఆపదలోకి తోసేసా... దానికి ఏరుకు తింటం రాదు. మిగతా పిచ్చుకలు పొడుస్తాయి, నాచేతులార దాన్ని ప్రమాదంలో పడేసి పాపం చేశాననుకొని బాధపడ్డా...

మర్నాడు ఉదయం నాన్నగారు వస్తే మాట్లాడుతూ కూర్చొన్నా... ఈలోగా పిచ్చుకలు గోల గోలగా అరుస్తున్నాయి. గబ గబ బయటకు వచ్చి చూశా... ఏముంది కాకి నోట్లో పిచ్చుక పిల్ల, చుట్టూ అరుస్తున్న పిచ్చుకలు. చిన్నబోయిన బంతి చెట్లు. చిన్నరాయి తీసుకొని కాకి మీదకి విసిరా. పిచ్చుక పిల్లతో సహా కాకి ఎగిరిపోయింది. పిచ్చిగా బంతి చెట్టుదగ్గరకు, గోడ మీదకు తిరిగింది తల్లిపిచ్చుక. తండ్రిపిచ్చుక ధైర్యం చెప్పి గూటికి వెళదాం రమ్మంది. కాని కదల్లేదు ఆ తల్లి... తండ్రి పిచ్చుక మాత్రం ఎక్కడికో వెళ్ళి నీళ్ళలో మునిగి వచ్చినట్లుంది. తన రెక్కలను ఆర బెటుట్టకొంటూ తల్లి పిచ్చుకను కవ్వించబోయింది. దాన్ని ముక్కుతో పొడిచి ఎటో వెళ్ళిపోయిందా తల్లి... రెండు రోజులు పోయాక మగ పిచ్చుక ఇంకో ఆడపిచ్చుకను తీసకొచ్చి గుసగుసలతో గూటిలో కాపురం ప్రారంభించింది. రెండు పిల్లలను పోగొట్టుకొన్న ఆ తల్లి పిచ్చుక ఆవేదనతో ఎటువెళ్ళి పోయిందో... పాప స్కూలు నుంచిరావడం ఆలస్యమైతేనే ఆదుర్దాపడే నేను... తన కళ్ళెదుటే తన పిల్లల మరణాన్ని చూసిన ఆ తల్లి మనసు ఏమని వర్ణించను?




# రామమోహనరాయ్‌ని అలరించిన గవర్నర్-జనరల్ భాష



భారత దేశంలో సతీ సహగమనాన్ని నిషేధిస్తూ చేసిన శాసనం 1829 డిసెంబరు 4న అమలుకు వచ్చింది. ఈ చట్టాన్ని రూపొందించడంలో ఈస్టు ఇండియా కంపెనీ ప్రభుత్వానికి రాజా రామమోహన్‌రాయ్ చేసిన సహాయం ఇంతా అంతా కాదు. అయితే, కొంతమంది ఛాందసవాదులకి ఈ సంస్కరణ నచ్చలేదు. దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ వారొక వినతి పత్రాన్ని తయారుచేసుకుని ఆనాటి గవర్నర్- జనరల్ లార్డ్ విలియం బెంటిక్‌కి సమర్పించారు. అంతేకాదు, లండన్‌కి వెళ్ళి ప్రీవీకౌన్సిల్లో అపీలు చేసుకోవడానికి కూడా వారు రంగం సిద్ధం చేసుకున్నారు.

ఈ సందర్భంగా గవర్నర్ జనరల్‌కి రాజా రామమోహన్‌రాయ్ సహాయం మళ్ళీ అవసరమైంది. తనను కలుసుకొనవలసిందని ఆయన తన ఎ.డి.సి.తో రామమోహన్‌రాయ్‌కి కబురంపారు. అప్పటికే రామమోహన్ రాయ్ రాజకీయాల నుంచి విరమించుకుని, మత గ్రంథ పరిశోధనలో కాలంగడపాలనుకున్నారు కనుక గవర్నర్-జనరల్ ఆహ్వానాన్ని ఆయన అంగీకరించలేకపోయారు.

రామమోహనరాయ్ నుంచి వచ్చిన ఈ సమాధానం గవర్నర్ జనరల్ నెంతో నిరుత్సాహపరిచింది. తన ఆహ్వానాన్ని రాజా గారి కందజేస్తూ ఎ.డి.సి. ఏం మాట్లాడాడో అన్నది అన్నట్లుగా చెప్పమన్నారు. "గవర్నర్-జనరల్ గారిని మీరొకసారి కలుసుకుంటే అందుకు వారెంతో ఆనందిస్తారని చెప్పాను" అని ఎ.డి.సి. చెప్పాడు. ఈ సమాధానం వినగానే విలియం బెంటింక్ కొంత సేపు దీర్ఘాలోచనలో పడిపోయి, "ఓహో! అలాగా! ఇప్పుడు నీవు మళ్ళీ వెళ్ళి విలియం బెంటింక్‌ని మీరు కలుసుకుంటే అందుకాయన ఎంతో ఆనందిస్తారని చెప్పు" అని చెప్పి పంపారు.

ఈసారి గవర్నర్ జనరల్ ఉపయోగించిన భాషతో రాజా రామమోహనరాయ్ పులకాంకితులయ్యారు. ఇప్పుడిక ఆయన ఆహ్వానాన్ని తిరస్కరించలేకపోయారు. వెంటనే బెంటింక్‌ని కలుసుకుని రానున్న పరిణామాల గురించి చర్చించారు.

ఇక ఛాందసుల ఆటలు సాగలేదు. రామమోహనరాయ్ లండన్‌కి వెళ్ళి సతీ సహగమనాన్ని రద్దుచేస్తున్న చట్టం శాస్త్ర సమ్మతమేనని పెక్కు ఆధారాలతో ప్రీవీ కౌన్సిల్‌లో వాదించి ప్రత్యర్థుల వాదనను చిత్తు చేశారు. ఈ విషయాలు ఆయన పార్లమెంటుకు సమర్పించిన పత్రం కూడా సభ్యుల అంగీకారం పొందింది. ఈ విధంగా రాజా రామమోహన్‌రాయ్ అరివీర భయంకరంగా పోరాడి సతీసహగమన నిషేధ చట్టానికి ప్రతిఘటన లేకుండా చేశారు.

- జి. వెంకట రామారావు.


అరణ్యంలో మారణహోమం మొదలైంది.
గిరిజనుల్లో కన్నెపిల్లలు అదృశ్యమౌతున్నారు..



డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ చైతన్యకి బాధ్యత అప్పచెప్పబడింది.



మరో మారణ కాండ ప్రారంభమైంది

కొమ్మనాపల్లి సీరియల్ ఆరంభమవుతుంది